శిథిలావస్థలో ప్రభుత్వాస్పత్రి భవనం

- భయాందోళనలో వైద్య సిబ్బంది, రోగులు
- ప్రారంభానికి నోచుకోని నూతన భవనం

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి భవనం శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పు ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. దీంతో వైద్య సిబ్బంది బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. వర్షం వచ్చిందంటే బాలింతల గది గోడలు ఉబ్బిపోయి దర్శనమిస్తాయి. రోగుల కోసం ఏర్పాటు చేసిన గదిలో పైకప్పు కారుతుంది. దీంతో చికిత్స కోసం వచ్చిన రోగులు పైకప్పు వైపు చూసుకుంటూనే చికిత్స తీసుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. అలాగే వైద్యులు స్థానికంగా నివాసం ఉంటూ రోగులకు వైద్య సేవలు అందించడం కోసం నిర్మించిన క్వాటర్స్ సైతం శిథిలావస్థకు చేరుకోవడంతో.. మౌలిక వసతులు లేక దూర ప్రాంతాల నుంచి విధులకు హాజరవుతున్నారు. అక్కడి సిబ్బంది సైతం రోగులతో సరిగా ప్రవర్తించడం లేదు. స్టాఫ్ నర్సుగా విధులు నిర్వహిస్తున్న వారు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భవనం నిర్మించారు.. ప్రారంభం మరిచారు

మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఆస్పత్రి భవనం నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. గత ప్రభుత్వ హయంలో నాడు-నేడు కింద రూ.కోటి నిధులతో నిర్మించిన ఈ ఆస్పత్రిని త్వరగా



కూలడానికి సిద్ధంగా ఆస్పత్రిలోని గది

ప్రారంభానికి సిద్ధం చేయాలని అప్పట్లో అధికారులు ఆదేశాలు జారీ చేసినా.. ఎన్నికలు రావడంతో ప్రారంభానికి నోచుకోలేదు. అయితే నాణ్యతా లోపం వలన ప్రారంభానికి నోచుకోక మునుపే గోడలు పగుళ్లతో దర్శనం ఇస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి నూతన ఆస్పత్రి భవనాన్ని ప్రారంభించాలని, వైద్య సిబ్బందికి మౌలిక వసతులు కల్పించాలని మండలవాసులు కోరుతున్నారు.



నూతనంగా నిర్మించిన ఆసుపత్రి భవనం

నాణ్యమైన వైద్యం అందించడానికి కృషి



ప్రభుత్వాస్పత్రిలో నాణ్యమైన వైద్యం అందించడానికి కృషి చేస్తున్నాం. ఉన్న పరికరాలతో తగిన వైద్యం చేస్తున్నాం. పాత ఆసుపత్రి భవనంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. త్వరగా కొత్త ఆసుపత్రి భవనం ఇస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందించవచ్చు.

– డాక్టర్ శ్రీనివాసబాబు, పెద్దవడుగూరు

భవనం ఎప్పుడు కూలుతుందో..



పెద్దవడుగూరు లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. రోగులు ఆస్పత్రికి వచ్చి బెడ్డు పై పడుకోవాలంటేనే భయపడుతున్నారు. పైకప్పు పెచ్చులు ఊడుతున్నాయి. కొత్త భనం గురించి ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. రోగుల గురించి కూడా సిబ్బంది పట్టించుకోరు.

– శివారెడ్డి చిన్నవడుగూరు

నూతన భవనం ప్రారంభించాలి



నూతనం నిర్మించిన భవనాన్ని త్వరగా ప్రారంభించాలి. పాత ఆస్పత్రిలో రోగులకు మౌలిక వసతులు లేవు. రోగుల ఇబ్బందులను గురించి ఎవ్వరూ పట్టించుకోరు. నాణ్యమైన వైద్యం అందిస్తే చాలా బాగుంటుంది. ఇక్కడ రాత్రి సమయాల్లో వైద్యులు లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి.

– బాలకృష్ణ, పెద్దవడుగూరు

ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు

యాడికి: పురుగుల మందులను ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి మహబూబ్ బాషా హెచ్చరించారు. యాడికిలోని పలు పురుగుల మందుల దుకాణాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన దుకాణాల్లో రికార్డులు, మందుల నిల్వలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పురుగుల మందులను కొనుగోలు చేసిన రైతులకు రసీదులు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం గుర్తించి కంపెనీల మందులనే విక్రయించాలన్నారు. పవన్, శ్రీ లక్ష్మి వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ దుకాణాల్లో కొన్ని ఉత్పత్తులను నాణ్యత పరిశీలన నిమిత్తం తిరుపతిలోని రీజనల్ కోడింగ్ సెంటర్‌కు పంపుతున్నట్లు ఆయన తెలిపారు.

పామిడి: పట్టణంలోని ఫర్టిలైజరు షాపులను శుక్రవారం ఏఓ డీ లీనా వసుంధర ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె స్థానిక రంగనాథ్, బాలాజీ, గణేష్, మణికంఠ, దుర్గ, లక్ష్మి, విష్ణు, వెంకట్ అగ్రో ఏజెన్సీలను తనిఖీ చేశారు. షాపుల అనుమతులతో పాటు ఎరువుల స్టాక్, సేల్స్ రికార్డులను పరిశీలించారు. అనుమతులు లేని పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్లు అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం స్థానిక ఏఓ కార్యాలయంలో రైతుసేవా కేంద్ర కార్యాలయ సిబ్బందికి పంటకోత ప్రయోగాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాసరావ్, ఏఎస్ఓ నిస్సార్, వ్యవసాయ సిబ్బంది శ్రీకాంత్, చిరంజీవి, ఆదినారాయణ, ఫిరోజ్, చందన, ఉష, అర్చన, రాధ, సాయిప్రసన్న, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని రైతు నిరసన

శింగనమల: తనకు న్యాయం చేయాలని రైతు రొద్దం విజయభాస్కర్‌రెడ్డి అనంతపురం-విజయవాడ 544-డీ రోడ్డుపై నిరసన వ్యక్తం చేశాడు. వివరాలు.. మండలంలోని శివపురం గ్రామానికి ఆయన పొలం పక్కలో కొండల్లో నుంచి వచ్చే నీరు చెరువులోకి పోయే విధంగా కాలువ ఉంది. కాలువ పక్కలో భూమిని కొనుగోలు చేసిన వారు, సర్వే చేయించుకుని కాలువ తమ పొలంలోకి వస్తుందని, పూడ్చడానికి మట్టి తోలారు. దీంతో వర్షం నీరు పోయే అస్కారం లేదు. 544-డీ రోడ్డు పనుల నేపథ్యంలో కొండల్లో నుంచి వచ్చే నీరు పోవడానికి కాలువ ఎదురుగా మోరీ నిర్మించారు. మోరీ నిర్మించడం వల్ల, నీరు ఎలా బయటకు పోతుందని, తన పొలంలోకి వర్షం నీరు వస్తుందని రైతు రోడ్డు పనులు చేసే ఇంజనీర్లకు విన్నవించాడు. రెవెన్యూ అధికారులు, కలెక్టర్ నిర్వహించే గ్రీవెన్స్‌లోనూ వినతి పత్రం అందజేశాడు. పూడ్చి వేసిన కాలువను తీయించాలని,



న్యాయం చేయాలని చేతులెత్తి మొక్కుతున్న రైతు విజయభాస్కర్‌రెడ్డి

లేకుంటూ మోరీని పూడ్చి వేయాలని కోరాడు. ఎవరు తమ సమస్య పట్టించుకోకపోవడంతో రోడ్డు పైకి వచ్చి నిరసన వ్యక్తం చేశాడు. దాదాపు గంట పాటు వాహనాలు రెండు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. చివరకు సీఐ కౌలుట్లయ్య అక్కడకు వెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రైతు నిరసన విరమించారు.

వేరుశనగలో పంటకోత ప్రయోగాలు

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో ఖరీఫ్‌లో సీజన్‌లో సాగుచేసిన వేరుశనగ, వరి పంటల్లో పంట కోత ప్రయోగాలు చేస్తున్నట్లు అనంతపురం వ్యవసాయశాఖ ఏడీ రవి తెలిపారు. శుక్రవారం ఆయన క్షేత్రస్థాయిలో పంట పొలాలు పరిశీలించారు. ఏడీ మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగుచేసిన వేరుశనగ, వరి, కంది పంటల్లో వాతావరణ ఆధారిత, ప్రధానమంత్రి పసల్ భీమా యోజన పంటల కింద పంట కోత ప్రయోగాలు చేస్తున్నామన్నారు. ఈ-పంట నమోదును వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు.రీ సర్వే జరిగిన గ్రామంలో జాయింట్ ఎల్‌పీఎమ్‌లను సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారులు ద్వారా పూర్తి చేయాలన్నారు.కౌలు రైతులను గుర్తించి కార్డులు అందించాలన్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల విత్తనాల కోసం రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓసోమశేఖర్ మండల గణాంక అధికారి రాజ్యలక్ష్మి, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



వేరుశనగలో పంట కోత ప్రయోగాలు చేస్తున్న ఏడీ రవి

పర్యావరణ పరిరక్షణ..మనందరి బాధ్యత

గుంతకల్లుటౌన్/గుంతకల్లు రూరల్: ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి సంరక్షించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని అన్నారు. శుక్రవారం వనమహోత్సవ కార్యక్రమంలో కంపోస్టు యార్డులో ఆమె మొక్కలు నాటి నీరు పోశారు. పర్యావరణ లోపం మానవులకు శాపంగా మారనుందన్నారు. అందువల్ల ప్రగతికి సోపానాలైన మొక్కలు పెంచాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, కౌన్సిలర్ నీలావతి, ఎంఈ గురప్ప, డీఈ హేమచంద్ర, ఏఈలు హరిక్రిష్ణ, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని నెలగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనసేవా సొసైటీ ఆధ్వర్యంలో వనమహోత్సవం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా పాఠశాల ఆవరణలో దాదాపు 500 మొక్కలను నాటారు. కార్యక్రమంలో నెలగొండ గ్రామస్తులు, విద్యార్థులు, జనసేవా సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.



గుంతకల్లులో మొక్క నాటి నీరుపోస్తున్న చైర్‌పర్సన్ భవాని, కమిషనర్ వెంకటరమణయ్య

కొనసాగుతున్న కార్మికుల ఆందోళన



బీకేఎస్‌లో మోకాళ్లపై నిలబడి ఆందోళన చేస్తున్న కార్మికులు



కల్లూరులో చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు

బుక్కరాయసముద్రం/గార్లదిన్నె: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం బీకేఎస్ మండల కేంద్రంలోని సత్యసాయి వాటర్ సరఫరా ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట 8వ రోజు మోకాళ్లపై నిలబడి కార్మికులు ఆందోళన నిర్వహించారు. కార్మికులు మాట్లాడుతూ ఆరు నెలలుగా జీతాలు మంజూరు చేయలేదన్నారు. 600 గ్రామాలకు నీటి సరఫరా ఆగిపోయినా ప్రభుత్వ యంత్రాంగం ఏం పట్టనట్లుగా వ్యవహరించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు రాఘవేంద్రాచారి, దేవదాస్, కిష్టప్ప, లక్ష్మీన్న, పెద్దన్న, నల్లప్ప, నారాయణ, విశ్వరూప, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గార్లదిన్నె మండలంలోని కల్లూరులో సత్యసాయి కార్మికులు చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు.

హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

గుంతకల్లు రూరల్: రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి సూచించారు. శుక్రవారం మండలంలోని జీ.కొట్టాల గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ రామాంజినమ్మ, వైస్ ఎంపీపీ చింబిలి ప్రభావతి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో పౌరుల హక్కులపై అవగాహన కల్పించారు. రూరల్ ఎస్ఐ సురేష్, మండల ఇంజినీర్ ఓబులేసు, ఎంఈఓ మస్తాన్ రావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరమ్మ సూచించారు. శుక్రవారం స్థానిక ఆర్డీటీ పాఠశాలలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కాలనీ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ పుల్లారెడ్డి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ వెంకటలక్ష్మి, డాక్టర్ అమర్‌నాథ్, ఏఎస్ఐ నారాయణనాయక్, కాలనీవాసులు పాల్గొన్నారు.

కల్లూరులో విషాదఛాయలు

- అశ్రునయనాలతో అన్నదమ్ముల అంత్యక్రియలు

గార్లదిన్నె: కల్లూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాలు.. మండలంలోని కల్లూరుకు చెందిన సాయి, చిన్న అనే అన్నదమ్ములు గురువారం పామిడి మండలం 44వ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం అన్నదమ్ముల మృత దేహాలు వాహనాల్లో శుక్రవారం కల్లూరుకు చేరుకోగా.. వందలాది మంది జనం తరలివచ్చి మృత దేహాలను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. ×దేవుడా ఎంత పని చేశావు, అన్నదమ్ములను ఒకేసారి తీసుకెళ్లావు₹ అని కుటుంబీకులు, బంధువులు రోదించిన తీరు పలువురిని కంట తడి పెట్టించింది. సాయి అనే యువకుడు కల్లూరులో ఫోటో స్టూడియో నిర్వహిస్తూ అందరినీ నవ్వుతూ పలుకరించేవారని గుర్తుచేసుకున్నారు. అనంతరం నిర్వహించిన అంత్యక్రియల్లో వందలాది మంది పాల్గొన్నారు.

400 కేవీ లైన్ ఏర్పాటుపై రైతుల ఆందోళన

పామిడి: మండలంలోని రామరాజుపల్లి పొలాల గుండా తమ అనుమతి లేకుండా 400 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు పనులపై గురువారం రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ శాఖాధికారులు లైన్ ఏర్పాటుకు సంబంధించి ఎటువంటి నోటీసులు, సమాచారం ఇవ్వకుండా పనులు కొనసాగింపుపై వారు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ విషయంపై సంబంధిత శాఖ ఏఈ సునీల్‌కుమార్‌ను సాక్షి ఫోన్‌లో సంప్రందించగా ఆయన స్పందించారు. ప్రజోపయోగ నిమిత్తం 400 కేవీ లైన్ ఏర్పాటుకు కేంద్రం చేపట్టిందన్నారు. దీనికి సంబంధించి కలెక్టర్ సంబంధిత ఉత్తర్వులను మండల తహసీల్దార్లకు నివేదించారు. మండల తహసీల్దార్లు ఏయే మండలంలో ఏయే రైతుల భూముల గుండా లైన్ వెళ్తుందన్న జాబితా ప్రకారం రైతులకు లీగల్ పరంగా లబ్ధి చేకూరేలా నోటీసులు పంపనున్నట్లు ఆయన చెప్పారు. ఈ లైన్ ఏర్పాటుకు సంబంధించిన విషయంపై రామరాజుపల్లి రైతులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు పామిడి ఇన్‌చార్జ్ తహసీల్దార్ జీ లక్ష్మినారాయణరెడ్డి తెలిపారు.

ఐదుగురికి రిమాండ్

యాడికి: మండలంలోని బోయరెడ్డిపల్లెలో శుక్రవారం వైఎస్సార్‌సీపీకి చెందిన ఐదుగురిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. ఇటీవల గ్రామంలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ ఇరువర్గాలు ఘర్షణ పడటంతో వైఎస్సార్‌సీపీకి చెందిన 22 మంది, టీడీపీకి చెందిన 12మందిపై కేసు నమోదైంది. ఈ నెల 15న వైఎస్సార్‌సీపీకి చెందిన 14మందిని, ఈనెల 27న టీడీపీకి చెందిన 9మందిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీకి చెందిన మరో ఐదుగురిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పామిడి: పామిడి సమీపంలోని పెన్నానది నుంచి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. సీఐ ఆధ్వర్యంలో అక్రమంగా ఇసుక తరలివెళ్తున్న చాకలి రాజా ట్రాక్టర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌ను తరలించారు.

'బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలి'

గుత్తి: గుత్తి నుంచి బేతంచెర్ల సమీపంలో ఉన్న బిల్లా స్వర్గం, వాల్మీకి కేవ్స్‌కు బస్సు సర్వీసులు నడపాలని గుత్తి కోట సంరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి కోరారు. గుత్తిలో శుక్రవారం ఆయన గుత్తి కోట గైడ్ రమేష్, సభ్యులు గురు శంకర్ తదితరులతో కలిసి మాట్లాడారు. గుత్తి నుంచి బస్సు సర్వీసులు నడిపితే టూరిస్టుల సంఖ్య పెరగడంతో పాటు ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుందన్నారు. అధికారులు స్పందించి వెంటనే గుత్తి నుంచి బిల్లా స్వర్గం, వాల్మీకి కేవ్స్‌కు ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని కోరారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో శనివారం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని నిర్వహించనున్నట్లు కమిషనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సమావేశానికి పాలక వర్గం సభ్యులు, మున్సిపల్ అధికారులు తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

సంక్షిప్త వార్తలు

'ఎంఈఓను సస్పెండ్ చేయాలి'

గుత్తి: విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ఎంఈఓ రవి నాయక్‌ను సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఎంఈఓ కార్యాలయం ఎదుట శుక్రవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట నాయక్, పట్టణ అధ్యక్షుడు కిరణ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ ఉదయం 11 గంటలు దాటినా ఎంఈఓ కార్యాలయానికి రాలేదన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్‌కు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. ప్రైవేట్ , కార్పొరేట్ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేకున్నా, అధిక ఫీజులు వసూలు చేస్తున్నా ఎంఈఓ పట్టించుకోవడం లేదని వారుఆరోపించారు. ఎంఈఓ పై విద్యాశాఖ ఉన్నతాధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

యల్లనూరు: మండలంలోని బుక్కాపురం గ్రామానికి చెందిన మంజుల గోపాల్ ఇంట్లో అక్రమ మద్యం అమ్ముతున్నాడన్న సమాచారం మేరకు శుక్రవారం సీఐ సుబ్రహ్మణ్యం దాడులు చేశారు. ఈ దాడుల్లో 28 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, నిందితుడని రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నారాయణ కానిస్టేబుళ్లు రవీంద్రారెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

రైల్వే ఆస్పత్రి క్వార్టర్స్‌లో చోరీ

గుంతకల్లుటౌన్: పట్టణంలోని రైల్వే ఆస్పత్రిలో డీఎంఓ (డివిజనల్ మెడికల్ ఆఫీసర్)గా పనిచేస్తున్న కె.హరిత నివసిస్తున్న క్వార్టర్స్‌లో చోరీ జరిగింది. ఇంటి తాళాల్ని పగులగొట్టి లోనికి చొరబడిన దుండగులు బీరువాల్లో భద్రపరిచిన రూ.50 వేల విలువ చేసే 5 గ్రాముల బంగారు కమ్మలు, 30 తులాల వెండి వస్తువులను చోరీ చేసినట్లు వన్ టౌన్ సీఐ బీ.మనోహర్ తెలిపారు. వైద్యురాలు తన కుటుంబసభ్యులతో కలిసి ఈ నెల 25న తిరుపతికి వెళ్లి 29న రాత్రి తిరిగివచ్చారు. ఇంట్లో చోరీ జరిగిన విషయాన్ని గమనించి పోలీసులకు సమాచారమందివ్వడంతో శుక్రవారం పోలీసులు, క్లూస్ టీమ్ సిబ్బంది ఇంటిని పరిశీలించారు. వైద్యురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్లుప్తంగా

సామూహిక వరలక్ష్మీ వ్రతం



వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ముఖమండపంలో లక్ష్మీదేవి అమ్మవారిని కొలువదీర్చి వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గుంతకల్లు మండల వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన మహిళలతో వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహింపజేసి, వారికి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు



చంద్రమౌళిని సన్మానిస్తున్న సంస్థ డైరెక్టర్

గార్లదిన్నె: ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని ట్రాక్టర్ నగర్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ బాలాజీ మురారి నాందెడే అన్నారు. శుక్రవారం ట్రాక్టర్ నగర్‌లో అగ్రికల్చర్ ఇంజనీర్ చంద్రమౌళికి పదవీ విరమణ సన్మానం చేశారు. ఆయన మాట్లాడుతూ చంద్రమౌళి 34 సంవత్సరాలుగా ఆంధ్ర ప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యాన, అస్సాం రాష్ట్రాల్లో వివిధ హోదాల్లో విధులు నిర్వహించారన్నారు కార్యక్రమంలో ట్రాక్టర్ నగర్ సంస్థ ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

14న లోక్ అదాలత్



మాట్లాడుతున్న జడ్జి మంజుల

గుంతకల్లుటౌన్: స్థానిక జేఎఫ్‌సీఎం కోర్టులో ఈ నెల 14న జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించనున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి ఎం.మంజుల తెలిపారు. లోక్‌అదాలత్ నిర్వహణపై శుక్రవారం కోర్టు హాల్‌లో ఆమె న్యాయవాదులు, పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. రాజీపడదగిన కేసులేవైనా ఉంటే లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో సీఐలు మహేశ్వరరెడ్డి, మనోహర్, ఎస్ఐ సురేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన శాస్త్రవేత్తలు



మొక్కలు నాటుతున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: మండలంలోని రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ప్రధాని మోదీ 'ప్లాంట్ ఫర్ మదర్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శాస్త్రవేత్తలు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. అనంతరం రేకులకుంట పరిశోధనా స్థానం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ మాధవీలత, డాక్టర్ కళ్యాణి, డాక్టర్ నటరాజ్, డాక్టర్ లక్ష్మన్, డాక్టర్ రమేష్ నాయక్ డాక్టర్ నజీరుద్దీన్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



ఊబిచెర్లలో శ్రీకృష్ణుడి ప్రతిమను ఊరేగిస్తున్న దృశ్యం

గుత్తి/గుత్తి రూరల్: గుత్తి పట్టణంలోని కోట రోడ్డులో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన నూతన మందిరంలో త్రైత సిద్ధాంతం- ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని జన్మాష్టమి వేడుకలను కొనసాగుతున్నాయి. మూడో రోజైన శుక్రవారం త్రైత సిద్ధాంతం భక్తులతో పాటు ప్రజలు పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని కె.ఊబిచెర్ల గ్రామంలో త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవ సమితి, ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం కృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఐదు రోజు కృష్ణుడి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. ఊరేగింపులో చిన్నారులు రాధ, కృష్ణుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో కె.ఊబిచెర్ల కమిటీ సభ్యులు వై.శ్రీనివాసులు, పి.రామచంద్ర, మధుసూదన్, రమేష్ పాల్గొన్నారు.

వీరాపురంలో సీఐ పర్యటన

తాడిపత్రి రూరల్: మండలంలోని ఫ్యాక్షన్ గ్రామమైన వీరాపురాన్ని శుక్రవారం కొత్తగా బాధ్యతలు తీసుకున్న అప్‌గ్రేడ్ రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తనిఖీ చేశారు. గ్రామంలోని పోలీస్ పికెటింగ్‌ను పరిశీలించారు. బందోబస్తు సిబ్బందితో మాట్లాడారు. గ్రామంలో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎన్ఎంయూ ఆధ్వర్యంలో నిరసన

గుంతకల్లుటౌన్/తాడిపత్రి అర్బన్: ఏపీపీటీడీ(ఆర్టీసీ) డ్రైవర్, కండక్టర్ల పట్ల ట్రెజరీ అధికారుల ఉదాసీనత వైఖరిని వ్యతిరేకిస్తూ శుక్రవారం నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు గుంతకల్లులోని ఆర్టీసీ డిపో ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎంయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.వై.స్వామి, డిపో అధ్యక్షుడు ఏఎల్ఎన్ గౌడ్ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లకు ఈ నెల జీతంతో కలపకుండా నిలిపివేసిన నైట్ అవుట్, ఓటీ అలవెన్సులను ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పునరుద్ధరింపచేయాలన్నారు. ఉద్యోగ, కార్మికులతో పాటు రిటైర్డ్ అయిన వారందరికీ చెల్లించాల్సిన బకాయిలను సకాలంలో విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి నటరాజ్, గ్యారేజీ కార్యదర్శి వెంకటరమణ, నాయకులు వివి.గౌడ్, రహంతుల్లా, వన్నూరప్ప, ఖలీల్, కృష్ణ, సుంకన్న తదితరులు పాల్గొన్నారు. అలాగే తాడిపత్రిలో ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ తాడిపత్రి ఆర్టీసీ డిపో ఉద్యోగులు స్థానిక బస్టాండ్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు.

'అక్రమ కూల్చివేతపై కచ్చితమైన నివేదికలు అందించాలి'

పామిడి: పట్టణంలోని ఎద్దులపల్లి రోడ్డులో సత్రం, అభయాంజనేయస్వామి ఆలయ ప్రహరీ కూల్చివేతపై అధ్యయనం చేపట్టాలని స్థానిక ప్రజా దళిత సంఘాలు శుక్రవారం డిమాండ్ చేశాయి. కోట్ల రూపాయలు విలువ చేసే ఆ స్థలాన్ని అప్పనంగా కాజేయాలన్న పన్నాంగంతోనే టీడీపీకి చెందిన కొందరు అక్రమార్కులు కూల్చి వేశారన్నారు. మండలంలోని చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల ప్రజలు శుభకార్యాలు చేసుకునేందుకు ఆలయంతో పాటు సత్రం ఎంతగానో ఉపయోగకరంగా ఉండేదన్నారు. ప్రజోపయోగమైన సత్రం, ఆలయం గోడ తొలగింపునకు సంబంధించి రెవెన్యూ, ఆర్అండ్‌బీ, పురావస్తు, దేవావదాయశాఖాధికారులు సమన్వయంతో అధ్యయనం చేసి కలెక్టర్‌కు నివేదించాలన్నారు. లేనిపక్షాన అన్ని ప్రజా దళిత సంఘాల సంఘటితంతో ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.

పాఠశాల సందర్శన

గుత్తి: పట్టణంలోని వివేకానంద పాఠశాలను శుక్రవారం ఎంఈఓ రవి నాయక్, సీడీపీఓ ఢిల్లీశ్వరి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ సందర్శించారు. గత గురువారం పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న శివసాయిని భారతి అనే టీచర్ హోం వర్క్ చేయలేదనే నెపంతో చితక బాదారు. ఈ నేపథ్యంలో ఎంఈఓ, సీడీపీఓ, ఎస్ఎఫ్ఐ నాయకులు పాఠశాలకు వెళ్లి ఘటనపై విచారణ చేపట్టారు. మరోసారి ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పాఠశాల యాజమాన్యాన్ని ఆదేశించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

యాడికి: మండల కేంద్రంలోని అగాపే వృద్ధాశ్రమంలో శుక్రవారం కోనుప్పల పాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కోనా జగదీశ్వర రెడ్డి నిత్యావసర సరుకులు అందించినట్లు ఆశ్రమ వ్యవస్థాపకుడు ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కోనా వరలక్ష్మి, శంకర్ రెడ్డి, సోమలత తదితరులు పాల్గొన్నారు.

పెద్దపేటలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు

యాడికి: జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో యాడికి మండలం పెద్దపేట ప్రాథమికోన్నత పాఠశాలలో రంగేశ్వరయ్య ఆధ్వర్యంలో శనివారం 39వ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా నేత్రదాన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం 71 మంది విద్యార్థినులకు కంటి వైద్య నిపుణుడు మధుసూధన్ రాజు కంటి పరీక్షలు నిర్వహించారు. ఉపాధ్యాయులు నాగరాజు, రాజేశ్వరీభాయ్, జయలక్ష్మి, అరుణాభాయ్, ప్రమీల, వరలక్ష్మి, నవనీత పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

తాడిపత్రి అర్బన్: యాడికి మండలంలోని రాయలచెరువు ప్రాంతంలో శుద్ధ పరిశ్రమల్లో పని చేస్తున్న వందలాది మంది కార్మికులకు కనీస వేతన కూలీ అమలు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం తాడిపత్రి పట్టణంలోని సీపీఐ కాలనీలో ఉన్నపార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కార్యదర్శి టి. రంగయ్య అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. పరిశ్రమల్లో శుద్ధ పౌడర్‌ను యాజమాన్యాలు గ్రేడింగ్ విధానంలో విక్రయాలు సాగిస్తూ, లాభాలు గడిస్తున్నాయన్నారు. కానీ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రామాంజనేయులు, ఉమాగౌడ్, మండల కార్యదర్శి నాగరంగయ్య, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడిపత్రి డివిజన్
9912220732, 9912220722,
9010588846, 9010223701